అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు


వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

వేముల : మండలంలోని వేల్పుల గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు అంగరంగ వైభవంగా ముగిశాయి. వేల్పుల గ్రామంలో నిర్మించిన వేణుగోపాలస్వామి, అంజనేయస్వామి, అంకాలమ్మ, బెస్తవారిపల్లె సమీపంలో భ్రమరాంబిక ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితులు గోపీనాథ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠను దిగ్విజయంగా పూర్తి చేశారు. వేల్పులలో ఆలయాలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఎంపీకి మెమెంటోలు అందజేశారు. భారీగా భక్తులు తరలి రావడంతో వేల్పుల కిక్కిరిసిపోయింది. ఉప సర్పంచి లింగాల పార్వతమ్మ పాల్గొన్నారు.

గ్రామీణ కళలకు ప్రత్యేక ఆదరణ

గ్రామాల్లో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలు గ్రామీణ సంప్రదాయాలకు నిదర్శనమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేల్పులలో విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. కోలాటం, చెక్కభజన పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండలాగుడు పోటీలను రైతుకు ఒక కళగా భావిస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆడుదాం ఆంధ్ర తరహాలో కోలాటం, చెక్కభజన వంటి కళలను ఆదరించేలా చూస్తామన్నారు. అనంతరం కోలాట, చెక్కభజన పోటీలలో గెలుపొందిన వారికి లింగాల రామలింగారెడ్డి, లింగాల ఉషారాణి రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేల నగదు బహుమతులు అందజేశారు. బండలాగుడు పోటీలలో గెలుపొందిన విజేతలకు వరుస బహుమతులుగా రూ.2 లక్షలు, రూ.1.5లక్షలు, రూ.1.2లక్షలు, రూ.1లక్ష, రూ.80వేలు, రూ.70వేలు, రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేల నగదు 12 మందికి అందజేశారు.

1. కడప జిల్లా చౌటపల్లి గ్రామానికి చెందిన మార్పుల చంద్రబాబు రెడ్డి ఎద్దులు 2331 ప్రథమ స్థానంలోనూ
2. గుంటూరు జిల్లా కుంచనపల్లి కు చెందిన పులగం త్రినజ్ఞారెడ్డి ఎద్దులు 2278 అడుగులు లాగే రెండో స్థానంలోనూ
3. వల్లూరు మండలం బాలుగారు పల్లెకు చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు 2071 అడుగులు లాగే మూడో స్థానంలోనూ
4. నంద్యాల జిల్లా పిఆర్ పల్లి కు చెందిన నాగయ్య ఎద్దులు 2000 అడవులు లాగి నాలుగో స్థానంలోనూ
5. గుంటూరు జిల్లా కుంచనపల్లి కు చెందిన పులగం త్రినజ్ఞారెడ్డి ఎద్దులు 1891 అడుగులు లాగి 5వ స్థానంలోనూ
6. అనంతపురం టౌన్ కు చెందిన నజీర్ బాషా ఎద్దులు 1753 అడుగులులాగి ఆరో స్థానంలోనూ
7. అనంతపురం జిల్లా మేడిమాకులపల్లి కు చెందిన తోట తిరుపాత్రెడ్డి ఎద్దులు 1671 అడుగులు లాగా ఏడో స్థానంలోనూ
8 అనంతపురం జిల్లా గార్లదిన్నె కు చెందిన రామాంజనేయులు ఎద్దులు 1599 అడుగులు లాగి ఎనిమిదో స్థానంలోనూ
9. చౌటపల్లి కు చెందిన మార్తల చంద్రబాబుల రెడ్డి ఎద్దులు 1559 అడుగులు లాగి తొమ్మిదో స్థానంలోనూ
10. కర్నూలు జిల్లాకు చెందిన ఉప్పరి సుందర ఎద్దులు 1508 అడుగులులాగి పదో స్థానంలోనూ
11. అనంతపురం అర్బన్ కు చెందిన కే రామసుబ్బారెడ్డి ఎద్దులు 1500 అడుగులులాగే 11 వ స్థానంలోనూ
12. వేముల మండలం రంగోలి పల్లి కు చెందిన మూలి రామసుబ్బారెడ్డి ఎద్దులు 1450 అడుగులు లాగే 12 స్థానంలో నిలిచాయి.

జగనన్నకు రుణపడి ఉండండి

పులివెందుల రూరల్ : పేదల సొంతింటి కల నెరవేర్చే విధంగా రాష్ట్రంలో జగనన్న పాలన కొనసాగిస్తున్నారని.. ప్రతి పేద వాడికి గూడు కల్పించాలనే లక్ష్యంతో జగనన్న కాలనీల పేర్లతో ఊర్లను నిర్మిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల మండలంలోని ఎర్రిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఎంపీ ప్రారంభించి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు, పార్టీలకతీతంగా జగనన్న కాలనీలో అర్హులైన వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఎర్రిపల్లె, అచ్చివెళ్లి గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీలతోపాటు కమ్యూనిటీ భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, సర్పంచ్ మల్లేశ్వరరెడ్డి, ఎంపీటీసీ ఈశ్వరరెడ్డి, బాంధవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడవాలి

పులివెందుల రూరల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని నగరిగుట్ట క్రిష్టియన్‌లైన్‌లో దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎష్ మధురెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం ఎంతో పోరాడిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. కాలనీలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రిష్టియన్ లైన్‌లో ఉన్న కాలనీకి అంబేద్కర్ కాలనీగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నామకరణం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అందరు తోడుగా నిలవాలి

జమ్మలమడుగు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక క్యాంబెల్ ఆసుపత్రి ఆవరణంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ ఏ. ఆగస్టిన్ రాజు పార్టీలోనికి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెత్తందారుల పక్షాన చంద్రబాబు నిలబడ్డారు. పేదల తరఫున జగన్‌మోహన్‌రెడ్డి నిలబడ్డారన్నారు.

అనంతరం ఎమ్మెల్యేడాక్టర్‌మూలె సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ దేవగుడి సోదరులు ఫ్యాక్షన్ రాజకీయాల ప్రోత్సహిస్తున్నారన్నారు. వైఎస్‌కుటుంబంతో పైకి వచ్చిన వారు నేడు ఆ కుటుంబపైన విమర్శలు చేస్తున్నారన్నారు. దేవగుడి సోదరులు వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు ఫిరాయిస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మూలె సుధీర్‌రెడ్డిని, ఎంపీ వైఎస్‌అవినాష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

పల్స్‌పోలియోపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ సాయిచరితారెడ్డి

ఎర్రగుంట్ల : మార్చి 3న జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించాలని చిలంకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిచరితారెడ్డి అన్నారు. చిలంకూరు పీహెచ్‌సీ ఆవరణలో సిబ్బందితో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 2226 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాగమునిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ


భోజనాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీటీసీ ఝాన్సీరాణి, తదితరులు

సింహాద్రిపురం : మండల పరిధిలోని గురజాల ప్రభుత్వోన్నత పాఠశాలను జెడ్పీటీసీ ఝాన్సీ రాణి, ఎంఈఓ శారద సోమవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల చదువుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిడ్డంగివారిపల్లె చెరువుకు నీరు విడుదల


పైపుల ద్వారా గిడ్డంగివారిపల్లె చెరువుకు చేరుతున్న నీరు


వేంపల్లె : మండలంలోని గిడ్డంగివారిపల్లె గ్రామంలోని చెరువుకు పీబీసీ కాల్వనుంచి సోమవారం నాలుగు మోటార్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటి సరఫరా చేసినట్లు వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి చొరవతో రూ.20 లక్షలు ఖర్చుచేసి కాల్వను బాగు చేయించామని తెలిపారు. చెరువు చుట్టూ ఉన్న గ్రామాలైన బక్కన్నగారిపల్లె, గిడ్డంగివారిపల్లె, టి.వెలమవారిపల్లె, తాళ్లపల్లె, ముసల్‌రెడ్డి పల్లె, కుప్పాలపల్లె రైతుల పొలాలకు నీరందడంతోపాటు, భూగర్భజలాలు పెరుగుతాయని తెలిపారు.

త్రాగునీటి సమస్య పరిష్కరించండి


పునరావాస కాలనీలో పర్యటించిన ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కొండాపురం : తమ కాలనీల్లో త్రాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని స్థానికులు ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు విన్నవించుకున్నారు. మండలంలోని గండ్లూరు, ఓబన్నపేట, శీతాపురం, కొండాపురం , రామచంద్రనగర్, శివసాయి హైస్కూల్ వెనుక భాగంలోని పునరావాస కాలనీల్లో సోమవారం ఆయన పర్యటించారు. బోర్లలో నీళ్లు లేక వేసవిలో నీటి సమస్య ఎర్పడిందని, ఒక వాటర్ ట్యాంక్‌ను రూ. 700 పెట్టి కొనుగోలు చేస్తున్నామని నిర్వాసితులు ట్రైనీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ఎంపీ కృషి


నూరుల్లా

పులివెందుల టౌన్ : మైనార్టీల సంక్షేమాని కిసీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డిల కృషి అభినందనీయమని మైనార్టీ నాయకులు నూరుల్లా పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ వేల్పుల సమీపాన ఏర్పాటు చేసిన మదర్సా అభివృద్ధికి దివంగత నేత వైఎస్సార్ హయాంలో అడుగులు పడ్డాయన్నారు. మైనార్టీ సోదరుల సంక్షేమానికి వైఎస్ కుటుంబ సభ్యులు చూపిస్తున్న చొరవ మరువలేనిదన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

జలం కోసం జనం పరుగు


నీటికోసం ఉంచిన తోపుడు బండ్లు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : భానుడి ప్రతాపానికి భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. పల్లెల్లో నీటి కోసం జనం పక్క ప్రాంతాలకు పరుగు తీయాల్సి వస్తోంది. మండలంలోని వద్దిరాల గ్రామంలో గత 20 రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. 2వేల మందికి పైగా నివసిస్తున్న ఈ గ్రామంలో భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోయాయి. గ్రామం దిగువన గ్రామ చావిడి సమీపంలో శ్రీకాంత్ ఇంటి వద్ద మాత్రమే కొళాయిలకు నీరు వస్తుండటంతో సగం ఊరంతా అక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. ఇది కాకుండా కొందరు ఏకంగా ట్రాక్టర్లలో ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లి సోలార్ ప్రాజెక్టు వద్ద బోరు నుంచి ట్యాంకర్లతో నీటిని తెచ్చుకొని పొదుపుగా వాడుకుంటున్నారు. ఇక చిన్న, మధ్యతరగతి కుటుంబాల నీటి అవస్థలు చెప్పనలవి కావు.

మైలవరం నీరే దిక్కు..

వద్దిరాలలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేత వెంపలాకు రామాంజనేయ యాదవ్ 500 అడుగుల లోతులో రెండు బోర్లు వేశారు. గ్రామ పంచాయతీ బోరులో కేవలం ఇంచురన్నర నీళ్లు పడ్డాయి. ఈ నీరు వద్దిరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే సుజలధార పథకం క్రింద గ్రామానికి తాగు నీరు అందిచేందుకు పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. మైలవరం నుంచి నీటిని అందించేవారు. అయితే కొన్నాళ్లకే పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడడంతో సరఫరా నిలిచిపోయింది. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో వద్దిరాల ప్రజలకు మైలవరం నీరు తాగే భాగ్యం దొరకలేదు. చిన్న మరమత్తులు చేస్తే నీటి సరఫరా చేయవచ్చుచనని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట వేడుక

సింహాద్రిపురం : మండలంలోని చవ్వారిపల్లె గ్రామంలో చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట వేడుకలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవాచనం, కలశస్థాపన తదితర పూజలు నిర్వహించారు. 27న మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం, 28న చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.తి

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సునీల్‌కుమార్

వేంపల్లె : భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వేంపల్లెకు చెందిన నాగిశెట్టి సునీల్‌కుమార్‌ను నియమిస్తూ బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ పదవి రావడానికి కృషి చేసిన నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉపాధి హామీపై సమావేశం

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఉపాధి హామీపై సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఓ విజయభారతి తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

29న మహా ధర్నా

వేంపల్లె : ఈనెల 29న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజి తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మహా ధర్నా కరపత్రాలను సోమవారం వారు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించారన్నారు. ఈ కార్యక్రమంలో నాగేష్, చలపతి, చిన్నోడు, శ్రీనివాసులు, కృష్ణయ్య, రవి, దోని, రమణ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వైభవం.. గంగమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక పూజలందుకొన్న తలపనూరు గంగమ్మతల్లి


రాతి దూలం లాగుతున్న ఎద్దులు

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు గంగమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వీరపునాయునిపల్లె మండల ప్రజలేగాక, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కమలాపురం మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలు వేలం వేయగా రూ.18వేల ఆదాయం వచ్చింది. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు.

రసవత్తరంగా బండలాగు పోటీలు

గంగమ్మ ఆలయ వారికోత్సవం సందర్భంగా ఆలయ నిర్వాహకులు సోమవారం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో 18 జతల ఎద్దులు పాల్గొన్నాయి. భారీగా ప్రజలు తరలి రావడంతో ఎండ తీవ్రతకు గురికాకుండా పందిళ్లు, తాగునీరు, మజ్జిగ అందజేశారు. కర్నూలు జిల్లా రుద్రవరానికి చెందిన గోపాల్‌గౌడ్ ఎద్దులు ప్రథమ స్థానం, కడప జిల్లా దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన చిన్న వీరన్న యాదవ్ ఎద్దులు ద్వితీయ, కడప జిల్లా దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన బోగాది సుదర్శన్ ఎద్దులు తృతీయ, ఎకోడూరుకు చెందిన చాగంటి నాగమోహన్ రెడ్డి ఎద్దులు, రుద్రవరానికి చెందిన ఎద్దులు నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి. ఎద్దుల యజమానులకు పోటీల నిర్వాహకులు రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10 వేలు వరుస బహుమతులుగా అందజేశారు.

జగనన్న ప్రభుత్వంలోనే అందరికీ లబ్ధి


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : జగనన్న ప్రభుత్వంలోనే అందరికీ లబ్ధి కలిగిందని, ప్రతి కుటుంబంలోనూ ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న ఆశయం అని చక్రాయపేట మండల ఇన్‌ఛార్జి వైఎస్.కొండారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వరికుంటపల్లెలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలుకరిస్తూ ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మళ్లీ జగనన్నను, అవినాష్‌రెడ్డి ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి లబ్ధి జరగలేదని, జగనన్న ప్రభుత్వం వచ్చాక లక్షలాది రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా వారి ఖాతాలకు బటన్ నొక్కి జమచేశారన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్‌రెడ్డి, మాధవీ బా లకృష్ణ, వేదమూర్తి, సురేష్‌రెడ్డి, పార్టీ నేతలు మధుసూధనరెడ్డి, సూర్యప్రసాదరెడ్డి, చంద్ర, తులసి, నాగేశ్వర, నారాయణరెడ్డి, రాజబాబు, మల్లయ్య పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీరంగనాథుడు


ఏకాంత సేవలో సతీసమేత శ్రీవేంకటరమణుడు


గరుడ వాహనంపై సతీసమేత శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రంగనాథస్వామి వారు సతీసమేతుడై గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మండపంలో స్వామికి అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, ఈఓ రమణలు పర్యవేక్షించారు. బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ పుష్పాలు సమర్పించారు. అనంతరం పట్టణ పురవీధులలో స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ముగ్ధమోహన రూపుడైన స్వామికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఉదయం (నేడు) శ్రీరంగనాథస్వామి కళ్యాణోత్సవం జరగనుంది.

ఏకాంత సేవలో శ్రీవెంకటరమణస్వామి

పులివెందుల నడిబొడ్డున వెల వేంకటరమణుడి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీవారు ఏకాంత సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వరదాచార్యులు సతీసమేత వెంకటరమణస్వామిని అద్దాల మండపంలో ఉంచి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. మంగళవారం ఉదయం వేంకటరమణస్వామి కళ్యాణం నిర్వహించనున్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం


కమలాపురం : పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


వల్లూరులో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మెన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి


కమలాపురం : రాష్ట్రంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘం అని, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా స్థాపించిన వాలంటీర్ వ్యవస్థ వైపు దేశంలోని రాష్ట్రాలన్నీ చూస్తున్నాయని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఏర్పాటుచేసిన 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ప్రతిభ చూపిన వాలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రల పురస్కారాలతో మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే పాలన చేర్చాలనే ఉద్దేశంతో సీఎం వాలంటీర్ల వ్యవస్థకు అంకురార్పణ చేశారన్నారు. జగనన్న ఆశయాన్ని సాధించడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించారన్నారు. అందుకే ప్రతిభచూపిన ఒక సేవా వజ్రకు రూ.45 వేలు, ఐదుగురు సేవా రత్నలకు రూ.30 వేలు, మిగిలిన వారికి సేవా మిత్ర పేరిట రూ.15వేల నగదు పురస్కారం ఇచ్చారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వాలంటీర్లు అందిస్తున్నారన్నారు. యువత ఉద్యోగాల్లో స్థిరపడే వరకు పనిచేస్తే వారిలో సేవాగుణం అలవడటంతోపాటు పెడదారిన పడకుండా ఉంటారన్నారు. స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో జన్మభూమి కమిటీలు లంచం లేనిదే ఏ పథకం అందించేవారు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, భారతి, సాదిక్, శ్రీనివాసరెడ్డి, హిదాయత్, అధికారులు నరసింహారెడ్డి, జ్యోతి, సుబ్రహ్మణ్యం, రాముడు, వలంటీర్లు పాల్గొన్నారు.

పథకాలు అందించిన ఘనత వలంటీర్లదే

వల్లూరు : రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఘనత వాలంటీర్లదేనని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మెన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. వల్లూరు మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సోమవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల లంచగొండి తనం , వివక్షతలను గమనించిన జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు సీఎం అయిన వెంటనే గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలను అమలులోకి తీసుకొచ్చి ప్రజలకు పాలనను చేరువ చేశారని అన్నారు. కరోనా లాంటి కష్ట కాలంలో వలంటీర్లు సేవలు అందించడంతో రాష్ట్రంలో మరణాలు తక్కువగా నమోదయ్యాయని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ పాలనలో మేలు జరిగిందని నమ్మితేనే మా పార్టీకి ఓట్లు వేయండని అడిగే దమ్మున్న ఏకైక నేత జగన్ అని కొనియాడారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ శంకర్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, క్రిష్టారెడ్డి, శంకర్ రెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఎంపీడీవో విజయ భాస్కర్, ఈవోపీఆర్‌డీ ప్రసాద్,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పోరాటం చేస్తాం

హైవే అధికారులపై మండిపడిన స్థానికులు


డిప్యూటీ తహసీల్దార్, సీఐలకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న స్థానిక నాయకులు, ప్రజలు

చెన్నూరు : కడప-కర్నూలు మార్గంలోని చెన్నూరు పాత రోడ్డు వద్దకు వాహనాలు రాకుండా అడ్డుకొని డివైడర్లు అడ్డం పెడితే ఎలా వెళ్లాలంటూ స్థానికులు జాతీయ రహదారి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తరలివచ్చి డిప్యూటీ తహసీల్దారు, సీఐలకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కడప-కర్నూల్ జాతీయ రహదారిపై గోసుల కళ్యాణమండపం క్రాస్ వద్ద నుండి చెన్నూరు పాత రోడ్డు వద్దకు వెళ్లే రహదారికి అడ్డంగా నేషనల్ హైవే అధికారులు డివైడర్లు పెట్టి రోడ్డును మూసి వేసేందుకు ప్రయత్నం చేయగా అడ్డుకోవడం జరిగిందని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని నేషనల్ హైవే అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నప్పటికీ శ్రద్ధ తీసుకోకుండా, ఇప్పుడు హడావిడిగా రోడ్డును మూసివేస్తామని రావడం విడ్డూరంగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం వారు నేషనల్ హైవే అధికారుల తీరుపై నినాదాలు చేశారు, ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.